నిర్మించారు.. వదిలేశారు

- నిర్మల్–భైంసా జాతీయ రహదారిపై నిరుపయోగంగా బస్‌షెల్టర్లు
- ప్రయాణికులు నిరీక్షించేది ఒకచోట.. బస్‌షెల్టర్ మరోచోట
- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- సమస్య పరిష్కరించాలని అధికారులకు వేడుకోలు



భైంసా: తిమ్మాపూర్‌లో నిరుపయోగంగా బస్‌షెల్టర్



కుంటాల: అర్లి(కే) క్రాస్ రోడ్డు వద్ద బస్సుల కోసం ఎండలో వేచి చూస్తున్న ప్రయాణికులు

కుంటాల: ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం నిర్మల్–భైంసా రోడ్డును జాతీయ రహదారిగా విస్తరించింది. ఏడేళ్ల క్రితం ఎన్‌హెచ్‌ఏఐ (నేషనల్ అథారిటీ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో రూ.230 కోట్ల నిధులతో 150 అడుగుల వెడల్పు రోడ్డును నిర్మించారు. నిర్మల్ నుంచి తానూరు మండలంలోని బెల్‌తరోడాలోని సరిహద్దు ప్రాంతం వరకు 51 కిలోమీటర్ల మేర రోడ్డును ఏర్పాటు చేశారు. అందులో భాగంగా జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న ఆయా గ్రామాల ప్రజల కోసం బస్సులు ఆగేలా బస్సుషెల్టర్లు నిర్మించారు. కానీ సదరు బస్‌షెల్టర్లు ఉన్న చోట బస్సులు ఆగడం లేదు. దీంతో ప్రయాణికులు ఎక్కేచోట నీడ సౌకర్యం లేక ఎండలో బస్సుల కోసం ఎదురుచూస్తున్నారు.

జాతీయ రహదారిపై తొమ్మిది బస్‌షెల్టర్ల నిర్మాణం..

జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న గ్రామాల్లో ప్రయాణికులు ఎక్కేచోట కాకుండా మరోచోట బస్‌షెల్టర్లను నిర్మించారు. దీంతో అవీ నిరుపయోగంగా మారాయి. నిర్మల్‌రూరల్ మండలంలోని తల్వేద, చిట్యాల, దిలావర్‌పూర్ మండలంలోని సిర్గాపూర్, న్యూలోలం, దిలావర్‌పూర్, నర్సాపూర్(జి) మండలంలోని నర్సాపూర్ (జి), భైంసా మండలంలోని తిమ్మాపూర్, వానల్‌పాడ్, మాటేగాం గ్రామాల్లో రూ.లక్షలు వెచ్చించి బస్ షెల్టర్లను నిర్మించారు. కానీ బస్సులు ఆగకపోవడంతో సదరు షెల్టర్లు వృథాగా మారాయి.

నిర్మించాల్సిన గ్రామాలివే..

నిర్మల్– భైంసా జాతీయ రహదారిపై ఇప్పటికీ కొన్ని గ్రామాల్లో బస్‌షెల్టర్లు నిర్మించలేదు. కుంటాల మండలం కల్లూర్, అర్లి(కె), నర్సాపూర్(జి) మండలంలో రాంపూర్, గుండంపల్లి చౌరస్తా వద్ద, తానూరు మండలం బెల్‌తరోడాలో ఇప్పటికీ బస్‌షెల్టర్లు నిర్మించలేదు.

బస్సులు ఆగనిచోట బస్సుషెల్టర్ నిర్మించడం, ప్రయాణికులు ఎక్కేచోట నిర్మించకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతూ చెట్ల నీడన, హోటళ్ల వద్ద నిరీక్షిస్తున్నారు.

ఆర్టీసీ అధికారులు స్పందించి..

ఆర్టీసీ అధికారులు స్పందించి బస్‌షెల్టర్ల వద్ద బస్సులు ఆగేలా చర్యలు తీసుకొని వాటిని వినియోగంలోకి తేవాలని ఆయా గ్రామాల ప్రజలు వేడుకుంటున్నారు. ఇప్పటికీ బస్‌షెల్టర్లు లేని గ్రామాల్లో ప్రయాణికులు ఎక్కేచోట నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అవసరం లేని చోట నిర్మించారు



నిర్మల్–భైంసా జాతీయ రహదారిపై అవసరం లేని చోట బస్‌షెల్టర్లు నిర్మించారు. దీంతో ప్రయాణికులు ఎక్కేచోట బస్సులు ఆగడం లేదు. దీంతో అవస్థలు తప్పడం లేదు. – రవి, విఠాపూర్, కుంటాల మం.

ఉన్నతాధికారుల దృష్టికి..

నేషనల్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్మల్–భైంసా జాతీయ రహదారిపై బస్‌షెల్టర్లను నిర్మించారు. అవి మా పరిధిలోకి రావు. అయినప్పటికీ ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి బస్‌షెల్టర్లు లేని చోట నిర్మించి.. ఉన్న గ్రామాల్లో వాటిని వినియోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకుంటాం.

– అమృత, భైంసా డీఎం

ప్రజలంతా బీఆర్‌ఎస్‌వైపే..

- మాజీ ఎమ్మెల్యే 'ఏలేటి' ప్రజలకు చేసిందేం లేదు
- పదేళ్లలో అన్నివర్గాలను ఆదుకున్నాం
- బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి



సారంగపూర్: ఆలూరులో ఓటు వేసే విధానం చెబుతున్న ఇంద్రకరణ్‌రెడ్డి

సారంగపూర్: రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, జరుగుతున్న అభివృద్ధిని చూసి ప్రజలు బీఆర్‌ఎస్ వైపే ఉన్నారని నిర్మల్ అభ్యర్థి, మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. మండలంలోని చించోలి(బి), ఆలూరు, లక్ష్మీపూర్, ప్రతాప్‌నగర్, బోరిగాం, యాకర్‌పెల్లి, గొడిసెర, జామ్, సారంగాపూర్, కౌట్ల(బి) గ్రామాల్లో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లో ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామానికి సీసీరోడ్లు, భగీరథ నీరు, చెత్త సేకరణకు ట్రాక్టర్లు, డంపింగ్‌యార్డులు, మిషన్ కాకతీయ ద్వారా చెరువుల అభివృద్ధి, మురికికాలువల నిర్మాణం, ఇలా అనేక కార్యక్రమాలను అమలు చేసి గ్రామాల్లో ప్రజల ఇబ్బందులను దూరం చేశామని అన్నారు. తాను దేవాదాయ శాఖ మంత్రిగా పని చేసిన కాలంలో 800 ఆలయాలను నిర్మించినట్లు పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత బీజేపీ అభ్యర్థి మహేశ్వర్‌రెడ్డి నిర్మల్ ప్రజలకు చేసిందేం లేదని.. తన వ్యాపారాలను విస్తరించుకోవడానికే పని చేశారని ఆరోపించారు. గత పదేళ్లలో అన్ని వర్గాల ప్రజలను ఆదుకున్నామని.. అధికారంలోకి వచ్చాక మరింత అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, పారిశ్రామికవేత్త అల్లోల మురళీధర్‌రెడ్డి, నారాయణరెడ్డి, మాణిక్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ మాధవరావు, మహిపాల్, వనజ, భోజన్న, దినేశ్, మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు ఉన్నారు.

వాకర్స్‌తో 'అల్లోల' ముచ్చట

నిర్మల్‌టౌన్: అందరికీ అందుబాటులో ఉంటూ అభివృద్ధి చేసే నాయకుడిని ఎన్నుకోవాలని నిర్మల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో బుధవారం ఉదయం వాకింగ్ చేశారు. ఈ సందర్భంగా వాకింగ్ చేస్తున్న వారితో ముచ్చటించారు. తాను రాజకీయాల్లో ఉన్నప్పటికీ రోజు వాకింగ్ చేస్తానని పేర్కొన్నారు.

సోన్: మండలంలోని సాకెర, కూచన్‌పెల్లి, సంగంపేట గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి వి.సత్యనారాయణగౌడ్ ఈవీఎంలు చూపుతూ ఓటు వేసే విధానంపై అవగాహన కల్పించారు. మండలాధ్యక్షుడు మోహినొద్దీన్, సర్పంచ్ విలాస్, శ్రీనివాస్, బండి లింగన్న, ఆనంద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మండలంలోని న్యూవెల్మల్ గ్రామంలో మాజీ సర్పంచ్‌లు తోట సాయన్న, రొడ్డ రాజేశ్వర్, అంబేకర్ ప్రసాద్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నర్సయ్య, కిరణ్‌రావు, సురేశ్‌యాదవ్, మల్లయ్య పాల్గొన్నారు.



సోన్: సాకెరలో ప్రచారం చేస్తున్న నాయకులు

లక్ష్మణచాంద: నిర్మల్ ఎమ్మెల్యేగా ఐకేరెడ్డిని గెలిపించాలని ఆయన కూతురు పల్లవిరెడ్డి మండలంలోని వడ్యాల్ గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులో బీఆర్‌ఎస్ మండల ఇన్‌చార్జి అల్లోల సురేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్‌టౌన్: తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధికి అడ్డుపడకుండా మరోసారి రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌కే పట్టం కట్టి గెలిపించాలని తెలంగాణ రాష్ట్ర చలన చిత్ర టీవీ, థియేటర్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, ఎన్నారై బీఆర్‌ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు అనిల్ కుర్మాచలం అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఎన్నారై సెల్ ప్రతినిధుల ఆధ్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో ఎన్నారై బీఆర్‌ఎస్ యూకే (లండన్)శాఖ అధ్యక్షుడు అశోక్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి రత్నాకర్, బహ్రెయిన్ శాఖ అధ్యక్షుడు సతీశ్‌కుమార్, చంద్రశేఖర్ గౌడ్, నవీన్ రెడ్డి, గొట్టిముక్కల సతీశ్‌రెడ్డి, మధుయాదవ్, రాజ్‌కుమార్ ముదిరాజ్, ప్రవీణ్ పంతులు, సుభాశ్, ఒమాన్ బీఆర్‌ఎస్ శాఖ అధ్యక్షుడు అహ్మద్, కార్యదర్శి రాకేశ్‌పటేల్, బీఆర్‌ఎస్ నాయకులు పూదరి సాయికష్ణ ఉన్నారు.

క్లుప్తంగా

సరిహద్దు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి



వాహనాన్ని తనిఖీ చేస్తున్న సీఐ నైలు

కుంటాల: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో భాగంగా మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు సీఐ నైలు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని దౌనెల్లి పంచాయతీ పరిధిలోని దౌనెల్లి తండా వద్ద మహారాష్ట్ర నుంచి వచ్చే వాహనాలను తనిఖీ చేశారు. ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా మద్యం, డబ్బు తరలించవద్దని హెచ్చరించారు. వారి వెంట ఎస్సై హన్మాండ్లు తదితరులున్నారు.

పనులకు వచ్చే కూలీల సంఖ్య పెంచాలి

ముధోల్: పనులకు వచ్చే ఉపాధిహామీ కూలీల సంఖ్య పెంచాలని డీఆర్డీవో విజయలక్ష్మి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఉపాధి కూలీలకు ఎప్పటికప్పుడు వేతనాలను చెల్లించేలా చూడాలని పేర్కొన్నారు. నర్సరీలను పరిశీలిస్తూ అవసరమైన సూచనలు, జాగ్రత్తలు చెప్పాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సురేశ్‌బాబు, ఏపీవో శిరీష, పంచాయతీ కార్యదర్శులు, టీఏలు, ఎఫ్ఏలు తదితరులున్నారు.

మద్యం పట్టివేత.. ఇద్దరిపై కేసు



పట్టుకున్న మద్యంతో పోలీసులు

నర్సాపూర్(జి): మండలంలోని నసీరాబాద్ గ్రామంలో బుధవారం రాత్రి పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా రాంపూర్ గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు అక్రమ మద్యం విక్రయిస్తూ పట్టుబడ్డారు. పట్టుకున్న మద్యం 17 లీటర్లు కాగా దీని విలువ రూ.17,280 ఉంటుందని పేర్కొన్నారు. మద్యాన్ని సీజ్ చేసి ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రవీందర్ తెలిపారు.

మెడికల్ షాపు తనిఖీ

కుంటాల: మండల కేంద్రంలోని ఓ మెడికల్ షాపును బుధవారం డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీలత ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వేరే చోటకు మెడికల్ షాపు మార్చినట్లు అధికారులు వెల్లడించారు. తమకు సమాచారం లేకుండా షాపు మరో చోటకు తరలించినందుకు శాఖ పరమైన చర్యలు తీసుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు. వారి వెంట పలువురు సిబ్బంది ఉన్నారు.

ఉత్సవమూర్తుల ఊరేగింపు

ఖానాపూర్: పట్టణంలోని శ్రీగోవిందమాంబ సమేత మద్విరాజ్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం బుధవారం నిర్వహించారు. అందులో భాగంగా ఉత్సవమూర్తి విగ్రహాలతో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన ఊరేగింపును వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని కుమురం భీం చౌరస్తాలో ఆలయం నుంచి గోదావరి తీరం వరకు ర్యాలీ తీశారు.మహిళల నృత్యాలు, కోలాటాలు ఆకట్టుకున్నాయి. బుధవారం మహాగణపతి పూజ, పుణ్యాహవచనం, 11 రకాల ద్రవ్యాలతో అభిషేకం, సర్వతోభద్రమండలి అలంకరణ, కలశ ప్రతిష్ట, అఖండ దీప ప్రజ్వలన, గణపతి హోమం అనంతరం గోదావరి వద్ద ఉత్సవ మూర్తి విగ్రహాలకు పంచామృతాభిషేకం నిర్వహించారు. అర్చకులు ప్రసాద్‌శాస్త్రి, హరీష్‌కుమార్ ఆధ్వర్యంలో పూజాది కార్యక్రమాలు కొనసాగాయి.



ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

ధైర్యంగా ఓటు వినియోగించుకోవాలి

సోన్: ప్రలోభాలకు లొంగకుండా ధైర్యంగా ఓటుహక్కును వినియోగించుకోవాలని సోన్ సీఐ నవీన్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని లోకల్ వెల్మల్, గాంధీనగర్, లెఫ్ట్ పోచంపాడ్, సిద్దులకుంట, జాఫ్రపూర్ గ్రామాల్లో సీఐ ఆధ్వర్యంలో స్థానిక పోలీసులు, బీఎస్ఎఫ్ బలగాలు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటు వజ్రాయుధమని భయపడకుండా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సైలు సంతోషం రవీందర్, శ్రీకాంత్, బీఎస్ఎఫ్ జవాన్లు, సిబ్బంది పాల్గొన్నారు.



లోకల్‌వెల్మల్‌లో మాట్లాడుతున్న సీఐ నవీన్‌కుమార్

బ్యాలెట్ ఓటు వేసిన ఉపాధ్యాయులు

ఖానాపూర్: జిల్లాకేంద్రంలోని సెయింట్ థామస్ పాఠశాలలో బుధవారం ఎన్నికల నిర్వహణపై ఉపాధ్యాయులు, ఉద్యోగులకు జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఖానాపూర్‌కు చెందిన అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కాగా ఇదివరకు బ్యాలెట్ పద్ధతిలో ఓటు హక్కు వినియోగం కోసం దరఖాస్తు చేసుకున్న పలువురికి బుధవారం అవకాశం వచ్చిందని ఉపాధ్యాయులు తెలిపారు. ఈ సందర్భంగా అధికారుల పర్యవేక్షణలో పలువురు ఉపాధ్యాయులు రహస్య ఓటింగ్ ద్వారా బ్యాలెట్ ఓటును వేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, రాజశ్రీనివాస్, వాల్గొట్ కిషన్, బెజ్జారపు మురళి, లింగమూర్తి, మురళి, గీత తదితరులు ఉన్నారు.



ఓటు వేసినట్లు చూపుతున్న ఉద్యోగులు

నర్సరీ పనుల్లో వేగం పెంచాలి

తానూరు: పదో విడత హరితహారం కోసం గ్రామాల్లో చేపడుతున్న నర్సరీ పనుల్లో వేగం పెంచాలని ఎంపీడీవో శ్రీనివాస్‌రావ్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందికి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో చేపడుతున్న నర్సరీ నిర్వహణ వివరాలను తెలుసుకున్నారు. హరితహారంలో నాటిన మొక్కలు ఎండిపోకుండా సంరక్షించాలని సూచించారు. ఈజీఎస్ ఏపీవో గంగాధర్, కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. వృథాగా భగీరథ జలం



కుంటాల: మండల కేంద్రంలోని 12వ వార్డులో మిషన్ భగీరథ జలం వృథాగా పోతుంది. కాలనీలో నీటి ట్యాంక్ సమీపంలో సీసీ రోడ్డు కింద పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడింది. కొన్ని నెలలుగా నీరంతా పోతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని కాలనీవాసులు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, కుంటాల, ఫోన్: 97018 36439

బీజేపీతోనే అన్నివర్గాల అభివృద్ధి

- నిర్మల్ అభ్యర్థి ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



సోన్‌లో మహేశ్వర్‌రెడ్డికి గజమాలతో స్వాగతం పలికిన నాయకులు

సోన్: బీజేపీతోనే అన్ని వర్గాల అభివృద్ధి జరుగుతుందని నిర్మల్ అభ్యర్థి ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలకేంద్రంతోపాటు కూచన్‌పెల్లి, గంజాల్, లోకల్‌వెల్మల్, న్యూవెల్మల్, బొప్పారం, సంగంపేట గ్రామాల్లో పార్టీ శ్రేణులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు వరి మద్దతు ధర క్వింటాల్‌కు రూ.3100 అందించి అర్హులకు కొత్తరేషన్ కార్డులు, సంవత్సరానికి నాలుగు సిలిండర్లు ఉచితంగా అందిస్తామని పేర్కొన్నారు. నియోజకవర్గంలో ఎక్కడికి వెళ్లినా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని.. వచ్చే ఎన్నికల్లో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి ప్రజలు బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. ఈనెల 30న ఎన్నికల్లో కమలం గుర్తుకు ఓటేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. అంతకుముందు మహేశ్వర్‌రెడ్డికి ఆయా గ్రామాల్లో ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో బర్ల హరీశ్‌రెడ్డి, మార గంగారెడ్డి, జక్కు రాజేశ్వర్, హైమద్, సరికెల గంగన్న, రాచకొండ సాగర్ శ్రీనివాస్, అంకం జ్ఞానేశ్వర్, బీజి రెడ్డి, సాయన్న తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక

లక్ష్మణచాంద: జిల్లా కేంద్రంలోని ఏలేటి మహేశ్వర్ రెడ్డి నివాసంలో బుధవారం మండలంలోని రాచాపూర్ గ్రామానికి చెందిన 250 మంది బీజేపీలో చేరారు. వారికి ఆయన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాచాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ వినోదతోపాటు అంబేద్కర్ సంఘం నాయకులు, గంగపుత్ర సంఘం సభ్యులు, రాచాపూర్ మాజీ సర్పంచ్ పోశెట్టి, మాజీ ఎంపీటీసీ పోశెట్టి, బీజేవైఎం మండల అధ్యక్షుడు హరీశ్ ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. కార్యక్రమంలో భూపాల్‌రెడ్డి, పోశెట్టి, హరీశ్, నవీన్, ముత్యం, శ్రీనివాస్, భీంరెడ్డి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్లో ఉంటూ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా

- ఖానాపూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి జాన్సన్‌నాయక్



జన్నారం: ప్రచారం చేస్తున్న జాన్సన్‌నాయక్

జన్నారం: ప్రజల్లో ఉంటూ ఖానాపూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్తానని ఖానాపూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి భుక్య జాన్సన్‌నాయక్ అన్నారు. బుధవారం జన్నారం మండలంలోని ఇందన్‌పల్లి, మొర్రి గూడ, టీజీపల్లి, కొత్తూరుపల్లి, చర్లపల్లి, కిష్టాపూర్, దేవునిగూడ, కామన్‌పల్లి, కవ్వాల్, కొత్తపేట, హాస్టల్‌తండా, బంగారుతండా గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఎంపీపీ సరోజన, జెడ్పీటీసీ చంద్రశేఖర్, రాజ రాంరెడ్డి, జనార్దన్, మున్వర్ అలీఖాన్, ఫజల్‌ఖాన్, మల్లేశ్ పాల్గొన్నారు.

ఖానాపూర్: విద్యావంతుడైన భుక్య జాన్సన్‌నాయక్‌ను ప్రజలు ఖానాపూర్ ఎమ్మెల్యేగా గెలిపించాలని తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అనిల్ అన్నారు. బుధవారం పట్టణంలోని జాన్సన్ నాయక్ క్యాంపు కార్యాలయంలో ఎన్నారైలతో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. విజన్ ఉన్న జాన్సన్‌నాయక్ గెలిస్తేని నియోజకవర్గం రూపురేఖలు మారుస్తాడన్నారు. ఎన్నారైలు షేక్ అహ్మద్, అశోక్‌గౌడ్, రత్నాకర్, రాకేశ్, దొనికెని నర్సయ్య, సతీశ్, మధు, రాజ్‌కుమార్, మారుతి, తేజ, ప్రవీణ్, సుభాశ్ పాల్గొన్నారు.

ఖానాపూర్: ఖానాపూర్ ఎమ్మెల్యేగా జాన్సన్‌నాయక్‌ను గెలిపించాలని బుధవారం పట్టణంలోని రెండో వార్డులో, షాపింగ్‌మాళ్లకు వెళ్లి బీఆర్‌ఎస్ నాయకులు ప్రచారం చేశారు.

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని మిలింద్‌నగర్, బుద్ధనగర్, భీంనగర్ కాలనీలో బీఆర్‌ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారం చేశారు. పీఏసీఎస్ చైర్మన్ మారుతి డోంగ్రె, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ అంజద్, షేక్ సుఫియన్, కోవ రాజేశ్వర్, కనక హనుమంత్‌రావ్, జాదవ్ లఖన్, ఆరెల్లి రాందాస్, విజయ్‌కుమార్, జాదవ్ ప్రకాశ్ పాల్గొన్నారు.

'చెప్పుడు మాటలు విని ఆగం కావొద్దు'

లక్ష్మణచాంద: చెప్పుడు మాటలు విని ఆగం కాకుండా కాంగ్రెస్‌కు ఓటేసి గెలిపించాలని నిర్మల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కూచాడి శ్రీహరిరావు అన్నారు. బుధవారం మండలంలోని బోరిగాం, ఒడ్డెపెల్లి, బాబాపూర్, నర్సాపూర్, లక్ష్మణచాంద గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండల కేంద్రంలో నిర్వహించిన ప్రచారానికి ప్రజలు తరలివచ్చారు. తనకు ఒక అవకాశం ఇస్తే నిర్మల్‌ను అభివృద్ధి చేసి చూపుతానని ఆయన పేర్కొన్నారు. సారంగాపూర్ జెడ్పీటీసీ రాజేశ్వర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రాజేశ్వర్, అట్ల రాంరెడ్డి, రవీందర్‌రెడ్డి, ఈటెల శ్రీనివాస్, నాగేశ్, రవి పాల్గొన్నారు.

సారంగపూర్: అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని శ్రీహరిరావు అన్నారు. మండలంలోని అడెల్లి, స్వర్ణ, సారంగాపూర్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జెడ్పీటీసీ రాజేశ్వర్‌రెడ్డి, రాజేశ్వర్, అబ్దుల్ హాదీ, సలీమ్, భోజాగౌడ్, నర్సయ్య తదితరులున్నారు.

మామడ: మండలంలోని పరిమండల్, పొన్కల్ గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు ప్రచారం చేశారు. లింగన్న, నర్సారెడ్డి, అజాం, అన్వర్ ఉన్నారు.

నర్సాపూర్(జి): మండలంలోని కుస్లీ, నర్సాపూర్(జి) మార్కెట్, టెంబుర్ని గ్రామాల్లో శ్రీహరిరావు అన్న కూతురు అర్పిత ప్రచారం నిర్వహించారు.

సోన్: మండలంలో శ్రీహరిరావు కూతురు మాధురి స్థానిక నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. 30న జరిగే ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటేయాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.



లక్ష్మణచాందలో మాట్లాడుతున్న శ్రీహరిరావు

ఆర్టీసీలోనే సురక్షిత ప్రయాణం

కుంటాల: ఆర్టీసీ బస్సులోనే ప్రయాణం సురక్షితమని.. సకాలంలో గమ్యస్థానాలకు చేరుతామని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కేకే రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో 'ప్రజల వద్దకు ఆర్టీసీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రయాణికులకు బస్సుల వివరాలు తెలిపేందుకు రూపొందించిన గమ్యం యాప్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆప్క గజ్జారాంయాదవ్, డిపో క్యాషియర్ హక్కు, విలేజ్ బస్ ఆఫీసర్ గుడ్దేటి శ్రీనివాస్, ప్రయాణికులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కేకే రెడ్డి